ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
బుధవారం 12 ఫిబ్రవరి 2025

తైపూస ఉత్సవం
పోటెత్తిన భక్తజనం

వడలూరులో జ్యోతి దర్శనం ● వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



తిరుచెందూర్ తీరంలో భక్తుల రద్దీ



వడపళనిలో సందడి





పళని దండాయుధపాణి ఆలయ తైపూస ఉత్సవాలు, వడలూరు సత్యజ్ఞాన సభలో జ్యోతి దర్శనం

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుబ్రమణ్యస్వామి క్షేత్రాల్లో మంగళవారం తైపూసం సందర్భంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన తిరుప్పరంగుండ్రంలో సోమవారం సాయంత్రం నుంచే భక్తులు చేరుకున్నారు. తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్ సముద్రతీరం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ఈ సారి 12 ఏళ్లలోపున్న బాలబాలికలు తమ శరీరాలకు శూలాలు గుచ్చుకొని, కావళ్ల మోసుకుంటూ పాదయాత్ర చేస్తూ వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సముద్ర స్నానాలుచేసి క్యూలైన్లలో వేచి దర్శనం చేసుకున్నారు. అదే విధంగా, దిండుగల్ జిల్లాలోని పళని దండాయుధపాణి ఆలయంలో ఈనెల 5వతేదినుంచి తైపూస ఉత్సవాలు జరుగుతున్నాయి.మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు అలంకరించిన రథంపై స్వామివార్లను కొలువుదీర్చి ఊరేగించారు. వడపళని మురుగన్ ఆలయంలో తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 గంటల వరకు భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. శరీరానికి శూలాలు గుచ్చుకున్న భక్తులు క్షీర కలశాలతో పాదయాత్రగా ఆలయానికి చేరుకొని మొక్కు చెల్లించుకున్నారు. కుండ్రత్తూర్‌లోని సుబ్రమణ్యస్వామి ఆలయం, ప్యారీస్‌లోని కందస్వామి ఆలయం, వల్లకోట సుబ్రమణ్యస్వామి ఆలయం, తిరుప్పోరూర్ కంద స్వామి ఆలయం సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో తైపూస వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.

టీవీకే నేతలతో
పీకే భేటీ

● **అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చ**



ప్రశాంత్ కిషోర్

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రత్యేక సలహాదారుగా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నియమితులయ్యారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే విజయమే లక్ష్యంగా ప్రశాంత్ కిశోర్ వ్యూహ రచన చేయనున్నారు. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఇందులో భాగంగా సోమవారం విజయ్‌తో భేటీ అయిన ప్రశాంత్ కిశోర్.. టీవీకే పార్టీ సిద్ధాంతాల గురించి, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన, ప్రజలను ఆకట్టుకునే హామీల గురించి కూడా చర్చించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పార్టీ ఎన్నికల విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ నివాసంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా శాఖ కార్యదర్శులను ప్రశాంత్‌కిషోర్ వరుసగా కలుసుకున్నారు. విక్రవాండిలో జరిగిన పార్టీ మహానాడులో డీఎంకే తనకు ప్రధాన రాజకీయ శత్రువని విజయ్ చేసిన ప్రకటనకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందన గురించి కూడా పార్టీ నాయకుల వద్ద ఆయన ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 14 నెలల గడువు మాత్రమే ఉండటంతో ఆలోగా పార్టీని పటిష్టం చేసి, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించి ఆ ఎన్నికలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ప్రశాంత్ కిషోర్ సూచించారు. జిల్లా కార్యదర్శులు, డిప్యూటీ కార్యదర్శులు, కోశాధికారులతో ఆయన చర్చించారు. ఏళ్లతరబడి రాష్ట్ర ప్రజలకు పరిష్కారం కాని సమస్యలేమిటో తెలుసుకుని వాటిని పరిష్కరించేలా తక్షణమే చేపట్టాలని టీవీకే నేతలకు ఆయన సలహా ఇచ్చారు. వీలైతే వచ్చే నెల నుంచే విజయ్ రాష్ట్ర వ్యాప్త పర్యటన చేయాలని, అప్పుడే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాస్త వెసులుబాటు వుంటుందని సూచించినట్లు తెలిసింది. టీవీకే జిల్లా కార్యదర్శులందరితోనూ ప్రశాంత్‌కిశోర్ వేర్వేరుగా మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా పాల్గొన్నారు.



ఆదవ్ అర్జునా

'కీచక టీచర్ల'
చిట్టా సిద్ధం



కఠిన చర్యలు...

రాష్ట్రవ్యాప్తంగా పదేళ్లలో విద్యార్థినులపై లైంగిక వేదింపులకు పాల్పడిన ఉపాధ్యాయుల జాబితా సేకరిస్తున్నారు. ఫిర్యాదులు, శాఖాపరమైన చర్యలు, కేసులు, విచారణ కమిటీ నివేదిక, శిక్ష విధింపబడినవి, పెండింగ్‌లో, విచారణలో ఉన్నవి, కేసులు ఎదుర్కొంటూ ఇంకా విధుల్లో ఉన్నవారు తదితర వివరాలను తీసుకుంటున్నారు. ప్రాథమిక విద్యాశాఖలో 80 మంది, పాఠశాల విద్యాశాఖలో 175 మంది చొప్పున మొత్తం 255 మంది జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. తప్పు చేసిన ఉపాధ్యాయులపై ఆర్డినెన్స్ 121 ప్రకారం తొలగించే అవకాశముంది. త్వరలోనే దీనికి సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

● **పదేళ్లలో లైంగిక వేధింపుల ఆరోపణలున్న టీచర్ల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం**

● **నిరూపణైతే ఉద్యోగం నుంచి డిస్మిస్.. విద్యార్హతల రద్దు**

● **మార్చి నుంచి అమలుకు విద్యాశాఖ నిర్ణయం**

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే కీచకులుగా మారుతున్న వేళ.. వారి భరతం పట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లైంగిక వేధింపులకు పాల్పడే టీచర్లను ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు వారి విద్యార్హత కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. ఆ మేరకు చర్యలకు ఉపక్రమించింది. గత పదేళ్లలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న టీచర్ల వివరాలు సేకరిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణగిరి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి 13 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కేసులో ఆ ఉపాధ్యాయులను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించగా, పాఠశాల విద్యాశాఖ ఆ ముగ్గురుని డిస్మిస్ చేసింది. అదే విధంగా తిరుచ్చి, ఈరోడ్, హోసూరు, శివగంగ సహా పలు ప్రాంతాల్లో విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతున్నారనే వార్తలు ఇటీవల వెలుగు చూడడంతో ఈ విషయం తీవ్రరూపం దాల్చింది. విద్యార్థులు పాఠశాలల్లో సురక్షితంగా ఉంటారని భావిస్తున్న తల్లిదండ్రులు, విద్యా వేత్తల్లో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ఉపాధ్యాయులను డిస్మిస్ చేయాలనే డిమాండ్ కూడా పెరుగుతోంది.

లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి ఆరోపణ నిజమని తేలితే సంబంధిత ఉపాధ్యాయుల విద్యార్హత రద్దు చేస్తామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా

రుజువైతే విద్యార్హత రద్దు....

లైంగిక ఫిర్యాదులకు పాల్పడిన ఉపాధ్యాయుల జాబితా, వారిపై తీసుకున్న చర్యలను నివేదిక సమర్పించాలని ఆ శాఖ డైరెక్టర్లకు ఉత్తర్వులందినట్లు సమాచారం. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాంటి వాటికి స్వస్తి పలికి విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాలని, ఘటనలకు బాధ్యులైన ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు కఠినతరం చేయాలని నిర్ణయించామన్నారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని 2012లో ఆర్డినెన్స్ (121) జారీ చేసిందని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వ సేవకుల ప్రవర్తనా నియమావళిలోని 19 (2) ఉపాధ్యాయులకు వర్తిస్తుందన్నారు. అయితే వివిధ కారణాలతో ఈ ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఈ ఉత్తర్వులు అమలుచేసేలా చర్యలు చేపట్టామన్నారు.



బిసెంట్‌నగర్ బీచ్‌లో దివ్యాంగులు సముద్రతీర అందాలను దగ్గరగా వీక్షించేలా రూ.1.61 కోట్లతో నిర్మించిన కొయ్య వంతెనను మంగళవారం సాయంత్రం ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి. చిత్రంలో జీసీసీ మేయర్ ప్రియ తదితరులున్నారు.

పోరూరు ప్రభుత్వాస్పత్రిలో
విధులకు వైద్యుల డుమ్మా

● **రోగుల్ని పట్టించుకునేవారే లేరు**

● **సిబ్బందిని నిలదీసిన నటుడు గంజా కరుప్పు**

● **రోగులతో కలిసి ఆందోళన**



మాట్లాడుతున్న సినీ నటుడు గంజాకరుప్పు

చెన్నై,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పోరూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్ళిన తమిళ సినీ హాస్యనటుడు గంజా కరుప్పు అక్కడ వైద్యులు విధులకు హాజరు కాలేదని తెలిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగుల బంధువులతో కలిసి ఆకస్మికంగా ధర్నాకు దిగారు. మంగళవారం ఉదయం గంజాకరుప్పు కాలినొప్పితో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్ళారు. ఆ సమయంలో వైద్యులెవరూ లేకపోవడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా సేపటివరకూ వేచి ఉన్నప్పటికీ వైద్యులెవరూ రాలేదు. అదే సమయంలో కొన ఊపిరితో ఉన్న ఓ వృద్ధురాలిని తీసుకువచ్చారు. అంతేగాక కుక్కకాటుకు గురైన వ్యక్తి కూడా లబోదిబోమంటూ చికిత్స కోసం వచ్చాడు. కానీ డాక్టర్లు లేకపోవడంతో వారు కారిడార్‌లోనే వుండిపోవాల్సివచ్చింది. దీంతో ఆగ్రహం చెందిన గంజాకరుప్పు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వివాదానికి దిగడమే కాకుండా రోగుల బంధువులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తూ లక్షలాది రూపాయలను జీతంగా తీసుకుంటున్న డాక్టర్లు ఉదయం 8 గంటలకు డ్యూటీకి హాజరుకావాల్సి ఉండగా మధ్యాహ్నం 3 వరకు ఆస్పత్రి ఛాయలకు కూడా రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చేరోగులకు చికిత్స చేసేందుకు ఆస్పత్రిలో అందుబాటులో ఎవరూ లేరని, ఈ విషయమై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని గంజాకరుప్పు డిమాండ్ చేశారు.

మదురైలో నేత్రపర్వంగా తెప్పోత్సవం

తెప్పోత్సవానికి హాజరైన భక్తులు





ప్రత్యేక అలంకరణలో మీనాక్షి సమేత సుందరేశ్వరుడు

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మదురైలో ప్రసిద్ధిచెందిన మీనాక్షి అమ్మవారి ఆలయంలో తై మాసం తెప్పోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నెల 31వ తేది ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వర స్వామివారు మాడవీధుల్లో పంచమూర్తులతో వాహనాల్లో విహరిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానాంశమైన బంగారు పల్లకీ ఉత్సవం సోమవారం జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం నుంచి బయల్దేరిన ఊరేగింపు అమ్మవారి సన్నిధి, కామరాజర్ వీధుల మీదుగా చింతామణిలో ఉన్న మండపం వరకు సాగింది. మంగళవారం ఉదయం నిర్వహించిన తెప్పోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామున మీనాక్షి అమ్మవారి ఆలయంలో అంబాళ్‌కు ప్రత్యేక అభిషేకం, ఉదయం 5 గంటలకు వెండి సింహాసనంలో మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ఉదయం 10.40 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న తీర్థకొలనులో పూలతో సుందరంగా అలంకరించిన తెప్పపై స్వామివార్లను కొలువుదీర్చి లోకకల్యాణార్థం విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా రాత్రి నిర్వహించిన తెప్పోత్సవంతో వార్షిక తెప్పోత్సవ వేడుకలు ముగిశాయి.

సమాచార దర్శిని

17 వరకు పొడి వాతావరణం

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఈ నెల 17వ తేది వరకు పొడి వాతావరణం ఉంటుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. అదే సమయంలో తెల్లవారుజామున, ఉదయం వేళల్లో దట్టమైన మంచు కురిసే అవకాశముందని తెలిపింది. రాజధాని నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 32-33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముందని, బుధవారం ఉదయం నగరం, శివారు ప్రాంతాల్లో మంచు అధికంగా కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

లోఫ్లోర్ ఎలక్ట్రికల్ బస్సుల కోసం టెండర్లు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) 600 లోఫ్లోర్ ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి కలిగిన ప్రైవేటు సంస్థలు ఆన్‌లైన్ ద్వారా మార్చి 10 నుంచి ఏప్రిల్ 4వ తేదిలోపు టెండర్లు సమర్పించాలి. టెండర్ల పరిశీలన అనంతరం సంస్థ ఎంపిక చేసి వర్క్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు, ఈ ఏడాదిలోగా ఈ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు ఎంటీసీ తెలిపింది.

ఈబీకి స్థానిక సంస్థల బకాయిలు రూ.7,351 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ బోర్డుకు స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు రూ.7,351 కోట్ల బకాయిలుంచాయి. మూడేళ్లలో మాత్రమే స్థానిక సంస్థల విద్యుత్ ఛార్జీల బకాయిలు రూ.3,351 కోట్లు పెరిగాయి. 25 కార్పొరేషన్లు, 139 మున్సిపాలిటీలు, 329 పట్టణ పంచాయతీలు, 12,524 పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలకు వినియోగించే విద్యుత్‌కు సంబంధించిన ఛార్జీలను విద్యుత్ బోర్డు చెల్లించాల్సి ఉంది.

రూ.7,375 కోట్ల పెట్టుబడులకు అనుమతి

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో రూ.7,375 కోట్ల మేర పారిశ్రామిక పెట్టుబడులకు అనుమతించారు. వేలూరు, తూత్తుకుడి, తిరుచ్చి, పెరంబలరు జిల్లాల్లో ఏర్పాటుకానున్న ఈ కర్మాగారాల ద్వారా సుమారు 19వేల మంది ఉపాధి పొందనున్నారు. ప్రపంచస్థాయి టాలెంట్ సెంటర్లు, నాన్-లెథర్ ఫుట్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: అయ్యప్పన్‌తాంగళ్, ఆర్ఆర్ నగర్, కాట్టుపాక్కం, పుష్ప నగర్, వేణుగోపాల నగర్, అన్నై ఇందిరా నగర్, వలసరవాక్కం కొంత భాగం, పోరూర్ గార్డెన్ ఫేస్ 1,2, రామస్వామి నగర్, అర్బన్ ట్రీ, ఆర్కాట్ రోడ్డు కొంత భాగం, ఎంఎం ఎస్టేట్, జీకే ఎస్టేట్, చిన్న పోరూర్, వానగరం కొంత భాగం, భరణి పుదూర్, కారంబాక్కం, సమయపురం, పొన్ని నగర్, చెట్టియార్ అగరం, పూందమల్లి రోడ్డు కొంత భాగం, పెద్ద కొలతువాంజేరి, మధురం నగర్, తెల్లియాగరం

ఈస్ట్ మొగప్పేర్: ఇళంగో నగర్, మూర్తి నగర్, సత్యవాది నగర్, ఆఫీసర్స్ కాలని, పింక్ అవెన్యూ, ఈబీ కాలని, రత్నం వీధి

రెడ్‌హిల్స్: ఈశ్వరన్ నగర్, పమ్మాదుకళం కాలని, ఇందిరా నగర్, టీహెచ్ రోడ్డు, సోలియమ్మన్ నగర్, గాంధీ నగర్.

14న డ్రాయింగ్ టీచర్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానంలో కేసుల కారణంగా నిలిపవేసిన డ్రాయింగ్ టీచర్ల పోస్టుల భర్తీకి సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 14వ తేది జరుగుతుందని ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) ప్రకటించింది. ఈ మేరకు టీఆర్బీ విడుదల చేసిన ప్రకటనలో.. 2012 నుంచి 2016 వరకు, పాఠశాల విద్యాశాఖలో ఖాళీగా ఉన్న గౌరవ ఉపాధ్యాయులు, డ్రాయింగ్ ఉపాధ్యాయుల భర్తీకి 2017 జూలై 26న నోటిఫికేషన్ విడుదల చేసి, సెప్టెంబరు 23న రాతపరీక్ష నిర్వహించామన్నారు. పరీక్షా ఫలితాలు 2018 జూన్ 14న విడుదల చేయగా, గౌరవ ఉపాధ్యాయుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా అక్టోబరు 12న విడుదల చేశామన్నారు. ఈ వ్యవహారంపై దాఖలైన కేసులో హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులతో, అభ్యర్థుల జాబితాలో మార్పులు చేపట్టి 2019 అక్టోబరు 18న కొత్త జాబితా విడుదల చేశామన్నారు. అనంతరం 2020 మార్చి 16న మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో, సర్టిఫికెట్ల పరిశీలన ఆధారంగా, తాత్కాలిక అభ్యర్థుల జాబితా విడుదల చేయగా, 2021 అక్టోబరు 12న ఆ జాబితా వాపసు కోవడం జరిగిందన్నారు. ఈ పోస్టులకు ఈ నెల 14వ తేది నుంచి తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని టీఆర్బీ తెలిపింది.

ఆదిద్రావిడ హాస్టళ్లలో 'బయో మెట్రిక్'

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆదిద్రావిడ హాస్టళ్లలో వంద శాతం బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,324 ఆదిద్రావిడ హాస్టళ్లున్నాయి. ఈ హాస్టల్స్‌లో విద్యార్థులు, వార్డెన్లు, వంట మనుషులు సకాలంలో హాజరయ్యేలా బయోమెట్రిక్ విధానం అమలుచేయాలని నిర్ణయించారు. తొలుత కొన్ని హాస్టల్స్‌లో ప్రయోగాత్మకంగా ఈ పరికరాలు వినియోగించి, ఏవైనా లోపాలుంటే సవరించి ప్రస్తుతం అన్ని హాస్టళ్లలో ఈ విధానం అమలులోకి తీసుకుకొచ్చారు. ఈ విషయమై ఆదిద్రావిడ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ... వేలిముద్రలు, కంటి రెప్పలు కూడా బయోమెట్రిక్‌లో నమోదుచేశామని, ఇక నుంచి వార్డన్లు, వంట మనుషుల రాకపోకల వివవరాలు ఉన్నతాధికారులు తెలుసుకోనేందుకు వీలవుందన్నారు.

పది ప్రాంతాల్లో కార్చిచ్చు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నీలగిరి, కన్నియాకుమారి జిల్లాల్లోని 10 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వేసవి కాలం ప్రారంభమైంది. ఈ కారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో అడవుల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, సోమవారం నీలగిరి జిల్లాలో రెండు ప్రాంతాలు, కన్నియాకుమారి జిల్లాలో 8 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని భారత అటవీ పరిశోధన సంస్థ రాష్ట్ర అటవీశాఖ అధికారులకు సమాచారం అందించింది. మంటలు ఆర్పే పనులు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రధాని మోదీ హయాంలోనే ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి

● గవర్నర్ ఆర్ఎన్ రవి కితాబు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రధాని అయిన తరువాతే ఈశాన్య రాష్ట్రాలన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని గవర్నర్ ఆర్ఎన్ రవి కితాబునిచ్చారు. ఐఐటీ మద్రాస్‌లో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై మంగళవారం జాతీయ సదస్సు జరిగింది. ఆ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. మోదీ హయాంలోనే ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త రహదారులు నిర్మించారని, కొత్తగా విమానాశ్రయాలు కూడా ఏర్పాటయ్యాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల మధ్య దశాబ్దాల తరబడి రవాణా సదుపాయాలు ఉండేవి కావని, ప్రస్తుతం ఆ రాష్ట్రాలన్నింటిని కలుపుతూ ప్రధాన రహదారులు నిర్మించారని చెప్పారు. 2013కు ముందు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లో యేడాదికి కనీసం వెయ్యి మంది ఉగ్రవాద చర్యలు, అనారోగ్యం తదితర కారణాల వల్ల ప్రాణాలు కోల్పోతుండేవారని, మోదీ ప్రధానిగా వచ్చాక ఆ పరిస్థితులన్నీ మారిపోయాయన్నారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో కొత్త పరిశ్రమలు, విద్యా సంస్థలు విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులు తదితర మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు ఏ రాష్ట్రంలో చదివినా తమ స్వరాష్ట్రానికి సేవ చేయాలని, పారిశ్రామికంగా అభివృద్ధిపరచేందుకు పాటుపడాలని కూడా పిలుపునిచ్చారు.



ఐఐటి మద్రాస్‌లో జరిగిన సదస్సుకు హాజరైన ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులతో మాట్లాడుతున్న గవర్నర్ రవి

మహాబలిపురంలో ఉత్తరాది ఐఏఎస్‌ల సందడి



అర్జున తపస్సు ప్రాంతంలో ఐఏఎస్ అధికారుల బృందం

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మహాబలిపురంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు పర్యటించారు. పల్లవ రాజుల కాలంలో నిర్మించిన రాతి శిల్ప కళాఖండాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన 20 మంది ఐఏఎస్ అధికారులు మంగళవారం ఉదయం మహాబలిపురం చేరుకోగా, వారికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి డా.కార్తికేయన్ ఘనస్వాగతం పలికారు. అనంతరం మహాబలిపురంలో ఉన్న పురాతన రాతి కళాఖండాల చరిత్రను కార్తికేయన్ వారికి వివరించారు. వెన్నముద్ద బండరాయి, పంచ రథాలు, అర్జున తపస్సు ప్రాంతం, ప్రాచీన లైట్ హౌస్, సముద్రతీరంలో ఉన్న శివ విష్ణు సన్నిధులను ఐఏఎస్‌లు తిలకించి వాటి ముందు సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహాబలిపురం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాల గురించి ఐఏఎస్ అధికారులు పర్యాటక శాఖ అధికారుల వద్ద అడిగి తెలుసుకున్నారు.

14న ఐదు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కం హైకోర్టులో తాగునీటి ప్రధాన పైపులో మరమ్మతుల కారణంగా ఈ నెల 14వ తేది ఐదు మండలాలకు తాగునీటి సరఫరాకు అంతరాయ కలుగుతుందని మెట్రో వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, రామాపురం మండలంలోని పురుషవాక్కం, పెరియమేడు, షావుకారుపేట, ఎగ్మూర్, చింతాద్రిపేట, తిరువిక నగర్ మండల పరిధిలోని ఓట్టేరి, అయనావరం, పెరంబూర్, సెంబియం, అన్నానగర్ మండల పరిధిలోని కీల్పాక్కం, విల్లివాక్కం, కెల్లీస్, తేనాంపేట మండల పరిధిలోని చేపాక్కం, ట్రిప్లికేన్, కోడంబాక్కం మండల పరిధిలోని టి.నగర్, సైదాపేట ప్రాంతాల్లో ఈ నెల 14వ తేది ఉదయం 10 నుంచి 15వ తేది ఉదయం 10 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు, అత్యవసర సేవలకు మెట్రోవాటర్ బోర్డు వెబ్‌సైట్ సంప్రదించి, లారీ ట్యాంకర్ల ద్వారా నీరు పొందవచ్చని అధికారులు తెలిపారు.

'గజ' తుఫాన్ పరిహారంపై పరిశీలన

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'గజ' తుఫాను పరిహారం అందలేదని ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. 2018లో తంజావూరు, తిరువారూరు సహా డెల్టా జిల్లాలు 'గజ' తుఫాను కారణంగా తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. తుఫానుకు 63 మంది మృతిచెందారు. 88వేల హెక్టార్లలో వరి, అరటి, కొబ్బరి చెట్లు నేలకూలాయి. తుఫాను బాధితులకు పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, గజ తుఫాను కారణంగా కూలిన గుడిసెలు, దెబ్బతిన్న పంటలు, పశువులు మృతి తదితరాలకు పరిహారం అందించాలిన కోరుతూ మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది, 2018లో సంభవించిన గజ తుఫాను బాధితులకు పరిహారం అందజేశామని, ఒకవేళ పరిహారం ఎవరికైనా అందలేకపోతే ప్రభుత్వానికి వినతిపత్రం ఇస్తే పరిశీలించి పరిహారం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ వాదన పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, ఎంత పరిహారం ఇవ్వాలి అనే విషయం ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని, అదే సమయంలో ప్రభుత్వం కూడా తగని పరిహారం చెల్లించాంటూ, పిటిషన్ విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీచేశారు.

జాలర్ల వలలో భారీ 'కోలా' చేపలు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడు ఫిషింగ్ హార్బర్ నుంచి వెళ్లిన జాలర్ల వలలో భారీ కోలా చేపలు లభించాయి. సత్యమూర్తికి చెందిన ఫైబర్ బోటులో చేపల వేటకు వెళ్లిన జాలర్ల వలలో 200 నుంచి 300 కిలోల బరువున్న 15కు పైగా మయిల్ కోలా, పన్ని కోలా చేపలు చిక్కాయి. ఈ చేపలు ఔషధ గుణం కలిగి ఉండడంతో, వేలంలో వ్యాపారులు పోటీపడి ఒక్కో చేపను రూ.40వేల నుంచి రూ.60వేల వరకు కొనుగోలు చేసి వెళ్లారు.



వలలో చిక్కిన మూడున్నర టన్నుల కోలా చేప

విద్యార్థిని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

● ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో స్పృహతప్పి మృతిచెందిన 7వ తరగతి విద్యార్థిని కవిబాల కుటుంబానికి ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.... తంజావూరు జిల్లా చొక్కనాథపురం గ్రామానికి చెందిన కన్నన్-పరిమళ దంపతుల కుమార్తె కవిబాల (12), పల్లత్తూర్‌లోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాలలో స్పృహతప్పి పడిపోయి మృతిచెందింది. విద్యార్థిని కవిబాల మృతి ఆమె కుటుంబానికి కలిగిన లోటు తీర్చలేనిదని, ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆమె కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందజేయనున్నట్లు సీఎం తెలిపారు.



మృతురాలు కవిబాల (ఫైల్ ఫొటో)

అన్నాడీఎంకేలో చేరిన ఎంఎన్ఎం నేత

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు కమల్ హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం చెన్నై సౌత్ జిల్లా కార్యదర్శి ఓం ప్రకాష్ అన్నాడీఎంకేలో చేరారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ని కలుసుకుని పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈపీఎస్‌తోపాటు పార్టీ ఐటీ విభాగం డిప్యూటీ కార్యదర్శి కృపాకరన్ తదితరులు పాల్గొన్నారు.



ఈపీఎస్ సమక్షంలో పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్న ఓం ప్రకాష్

ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

● కేక్ కట్ చేసిన జాలర్లు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ పాంబన్ జాలర్లు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కేంద్ర మంత్రివర్గంలో ప్రత్యేకంగా మత్స్యశాఖ ఏర్పాటుచేసి, ఆ శాఖకు మంత్రిని నియమించి, సుమారు రూ.20వేల కోట్ల పథకాలు అమలుచేస్తున్న ప్రధానికి పాంబన్ జాలర్లు కృతజ్ఞతలు తెలిపారు. పడవల్లో జాతీయ పతాకం, మోదీ చిత్రపటాన్ని పట్టుకున్న జాలర్లు నడి సముద్రంలోకి వెళ్లి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.



పాంబన్ వంతెన సమీపంలోని సముద్రంలో వేడుకలు నిర్వహిస్తున్న జాలర్లు

రేషన్ దుకాణానికి నూతన భవనం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి యూనియన్ కోరమంగళం గ్రామంలో ఉన్న రేషన్ దుకాణానికి రూ.12 లక్షలతో కొత్త భవనం నిర్మించారు. ఈ భవనాన్ని మంగళవారం తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులకు ఎమ్మెల్యే సరుకులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ డీఎంకే కార్యదర్శి కృష్ణన్, పంచాయతి మాజీ సర్పంచ్ నరసింహరాజు,ఇంజనీర్ ధర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగుల పునరావాస కేంద్రం కోసం

రామ్‌రాజ్ సంస్థ రూ. కోటి విరాళం

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో క్యాన్సర్ రోగుల పునరావాస కేంద్రం కోసం 'రామ్‌రాజ్' కాటన్ సంస్థ రూ.కోటి విరాళం అందించింది. మంగళవారం ఈ పునరావాస కేంద్రానికి భూమి పూజ జరగగా, రామరాజ్ కాటన్స్ వ్యవస్థాపక ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ విరాళాన్ని చెక్కు రూపంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్, ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఎ.మురుగనాథన్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా తిరుప్పూర్ జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న కేఆర్ నాగరాజన్

నేడు పుదుచ్చేరి అసెంబ్లీ

పుదుచ్చేరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుంది.. స్పీకర్ ఏంబలం సెల్వం తిరుక్కురళ్ సూక్తిని పఠించి సభ ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ అదనపు వ్యయాలకు సంబంధించిన ఆర్థిక పద్దులను ఆమోదించనున్నారు.ఆ తర్వాత సభను స్పీకర్ వాయిదా వేస్తారు. రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మీదట మార్చిలో మళ్ళీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి.

టీబీవీఎస్‌లో ఫిజియోథెరపీ సెంటర్

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డు సమీపంలో ఉన్న టక్కర్ బాబా విద్యాలయ సమితి (టీబీవీఎస్)లో ఉచిత ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభమైంది. క్యూరేటివ్ హెల్త్ స్టూడియో ఆధర్యంలో పనిచేయనున్న ఈ సెంటర్‌ను సీఎం కార్యదర్శి డాక్టర్ ఎంఎస్ షణ్ముగం, హేమలత షణ్ముగం మంగళవారం ప్రారంభించారు. ప్రతి శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సెంటర్‌లో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు పొందవచ్చని, మరిన్ని వివరాలకు 6385185817, 6385185317 అనే నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు





ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదిన వేడుకల్లో భాగంగా మదురై జిల్లా అలంగానల్లూరులో మంగళవారం జల్లికట్టు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మూర్తి - ఓ పోట్లగిత్తతో పోరాడుతున్న యువకుడు.

● సిలిండర్ పేలుడు ఘటన....

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్కం ఆస్పత్రిలో సిలిండర్ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న ముగ్గురు మృతిచెందారు. నుంగంబాక్కంలో ఈ నెల 4వ తేది సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరకుమార్ (64), లక్ష్మి (57), గుణశేఖర్ (40) కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం : వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ సమీపంలోని స్పా సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైలాపూర్ పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు మైలాపూర్ సీఐటీ కాలనీలోని బిషప్ వాలర్స్ అవెన్యూ (సౌత్) ప్రాంతంలో పనిచేస్తున్న ఓ స్పా సెంటర్‌లో సోమవారం పోలీసులు ఆకస్మిక తనిఖీ చేసి, వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఎంజీఆర్ నగర్ తిరునావుక్కసర్ వీధికి చెందిన గణేష్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, ఆ సెంటర్‌లో ఆరుగురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

బైక్ కావాలని నిప్పంటించుకున్న యువకుడి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనివ్వని తండ్రిని బెదిరించేందుకు నిప్పంటించుకున్న యువకుడు చికిత్స ఫలించక మృతిచెందాడు. మధురవాయల్ పిళ్లయార్ ఆలయ వీధికి చెందిన మురుగన్, కుమారుడు జీవా (19) భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. తనకు బైక్ కొనివ్వాలని తండ్రిని పలుమార్లు జీవా కోరినా, ఆయన అంగీకరించలేదని తెలిసింది. ఈ క్రమంలో, గత ఆదివారం మళ్లీ జీవా బైక్ కావాలని తండ్రిని కోరగా ఆయన నిరాకరించాడు. దీంతో, తాము పనిచేస్తున్న మేట్టుకుప్పం రోడ్డులోని షెడ్డుకు వెళ్లిన జీవా, అక్కడ ఉన్న బైక్ నుంచి బాటిల్‌లో పెట్రోల్ నింపుకొని ఇంటికొచ్చాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకున్న జీవా, బైక్ కొనివ్వాలని తండ్రి కోరుతూ, పక్కనే నీరు వేడిచేసేందుకు ఏర్పాటుచేసిన పొయ్యి వద్దకు వెళ్లాడు. ఊహించని విధంగా అతని శరీరానికి మంటలు అలుముకున్నాయి. చుట్టుపక్కల వారు మంటలు అదుపుచేసి కీల్పాక్కం ప్రభుత్వానికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై మధురవాయల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు పట్టాలపై పగుళ్లు

● ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా తిరుకాంబులియూర్ ప్రాంతాల్లో రైలు పట్టాలపై ఏర్పడిన పగుళ్లను సకాలంలో గుర్తించడంతో ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. తిరుకాంబులియూర్ మార్గంలో మంగళవారం ఉదయం రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కలియమూర్తి వెళ్తున్న సమయంలో, రైలు పట్టాలపై పగుళ్లను గుర్తించాడు. కలియమూర్తి ఈ విషయాన్ని వెంటనే గ్యాంగ్‌మెన్‌లకు తెలియజేశాడు. అదే సమయంలో వస్తున్న ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్‌కు గ్యాంగ్‌మెన్‌లు ఎర్రజెండా చూపించి నిలిపివేశారు. పగుళ్లు ఏర్పడిన వంద మీటర్ల దూరంలోనే రైలు నిలవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే, వాస్కోడిగామా-వేలాంకన్ని ఎక్స్‌ప్రెస్ మాయనూరు రైల్వేస్టేషన్‌లో, కరూర్-తిరుచ్చి అన్ రిజర్వ్‌డ్ రైలు వీరాక్కియం రైల్వేస్టేషన్‌లలో నిలిపివేశారు. పగుళ్లు ఏర్పడిన ప్రాంతాన్ని కార్మికులు సరిచేయడంతో 45 నిమిషాలు ఆలస్యంగా ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరి వెళ్లింది.



పగుళ్లు ఏర్పడిన ప్రాంతంలో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

విద్యార్థుల మధ్య ఘర్షణ

● తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఎడప్పాడి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఎడప్పాడి మున్సిపాలిటీ పరిధిలోని విస్‌డమ్ ప్రైవేటు మెట్రిక్యులేషన్ పాఠశాలలో సోమవారం సాయంత్రం ఇళ్లకు వెళ్లేందుకు 9వ తరగతి విద్యార్థులు పాఠశాల వ్యాన్ ఎక్కే సమయంలో, వారి మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కందగురు అనే విద్యార్థిని సేలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక అతను మృతిచెందాడు. ఈ ఘటనపై ఎడప్పాడి పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

జీహెచ్ డీన్‌ను బంధించిన వైద్యుడి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డీన్ తేరణిరాజన్‌ను ఇంట్లో బంధించి తాళం వేసిన వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ పనిచేసిన వైద్యుడి మానసికపరిస్థితి సరిగా లేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఎగ్మోర్ పోలీస్ స్టేషన్‌లో తేరణిరాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ జరిపి ఆ వైద్యుడుని అరెస్టు చేశారు. అయితే, ఆ వైద్యుడి పేరు, వివరాలను మాత్రం పోలీసులు వెల్లడించలేదు. తేరణిరాజన్ తన నివాసంలో ఉండగా, ఒక వైద్యుడు వచ్చి ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు సాయంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తేరణిరాజన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ముంబయిలో జ్యువెలరీ షో పేరిట బురిడీ

● రూ.8కోట్ల విలువైన ఆభరణాలతో పరారీ

● ముగ్గురు వ్యాపారుల కోసం గాలింపు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలిఫెంట్‌గేట్‌లో ఐదుగురు నగల వ్యాపారుల దగ్గర రూ. 8 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకెళ్ళిన ముగ్గురు వ్యాపారుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. షావుకారుపేట ఎన్సీఎన్సీ బోస్‌రోడ్డులో మహిపాల్ జైన్, జితేంద్రజైన్, మనోజ్‌కుమార్, సంకేష్ కొఠారి, రాజీవ్ మెహతా అనే ఐదుగురు బంగారు ఆభరణాల దుకాణాలు నడుపుతున్నారు. అదే ప్రాంతంలోనే ముకేష్, మోనిష్, సునీల్ అనే అన్నదమ్ములు టోకుగా బంగారాన్ని కొనుగోలు చేసి పలు నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో జనవరిలో మహిపాల్‌జైన్ సహా ఐదుగురు వ్యాపారుల వద్దకు ఆ ముగ్గురూ వెళ్లి ముంబయిలో జ్యువెలరీ షో జరగనుందని, ఆ షోలో తమ సంస్థ కూడా పాల్గొని ఆభరణాలను విక్రయించనుందని చెప్పారు. ఆ షోలో పాల్గొనటానికి తమకు 10 కేజీల వరకు బంగారు ఆభరణాలు అవసరమవుతాయని చెప్పి వారి దగ్గర నుంచి 11 కేజీల బంగారు ఆభరణాలు తీసుకెళ్ళారు. ఆ షోలో విక్రయించగా మిగిలిన ఆభరణాలను తిరిగిచ్చే మాటపై ఆ ముగ్గురు అన్నదమ్ములు ఆ ఆభరణాలను తీసుకెళ్ళారు. అయితే నెల దాటినా బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వకపోవటమే గాక, ముగ్గురూ మాయమయ్యారు. దీంతో మోసపోయామని గ్రహించి ఆ ఐదుగురు వ్యాపారులు ఎలిఫెంట్‌గేట్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రైలులో అత్యాచార ఘటన వ్యవహారం..

గర్భస్థ శిశువు తొలగింపు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా జోలార్‌పేట వద్ద రైలులో ఓ మహిళపై అత్యాచారానికి యత్నించి ఆమెను రైలు నుంచి తోసివేసిన విషయం తెలిసిందే. ఈ అఘాయిత్యానికి పాల్పడిన హేమరాజ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ మహిళ స్వస్థలం తిరుప్పూర్ కాగా, పుట్టిల్లు చిత్తూరు జిల్లా. ఘటన సమయంలో ఆ మహిళ నాలుగు నెలల గర్భవతి. కదులుతున్న రైలు నుంచి కింద పడడంతో ఆ మహిళ తీవ్రంగా గాయపడి వేలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో గాయపడిన మహిళ కడుపులోని పిండం దెబ్బతిన్నట్లు గుర్తించిన వైద్యులు.. శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కాలు, చేతి ఎముక విరగడంతో వైద్యులు చికిత్స చేసి కట్టుకట్టారు. ఆమె ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు.

ఫాంటసీ హర్రర్ కామెడీ మూవీ 'హౌస్‌మేట్స్'



'హౌస్‌మేట్స్' ఫస్ట్‌లుక్

ప్రపంచ వ్యాప్తంగా ఫాంటసీ హర్రర్ కామెడీ చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ లభిస్తుంది. ఇలాంటి చిత్రాలు అన్ని వర్గాల వారికి బాగా నచ్చుతాయి. అందుకు తగినట్టుగానే 'హౌస్‌మేట్స్' అనే పేరుతో ఓ మూవీ తెరకెక్కుతుంది. హీరోగా దర్శన్, మరో ముఖ్య పాత్రలో కాళీ వెంకట్ నటిస్తున్నారు. అర్షా శాంతిని బైజు హీరోయిన్. వినోదిని, దీనా, అబ్దుల్ లీ, మాస్టర్ హెన్రిక్ తదితరులు నటించారు. దర్శకుడు అజియ్ జ్ఞానముత్తు వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన టి.రాజవేల్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఇటీవల ఘన విజయం సాధించిన 'డిమాంటీ కాలనీ-2' సినిమాకు కథ, స్క్రీప్లే అందించిన బృందంలో పనిచేశారు. ప్లే స్మిట్ స్టూడియోస్ పతాకంపై ఎస్.విజయ్ ప్రకాష్, సౌత్ స్టూడియోస్ అధినేత ఎస్.పి.శక్తివేల్ సంయుక్తంగా నిర్మించారు. మధ్యతరగతి కుటుంబాల రోజువారీ బాధలు, భావాలను ప్రతిబింబిస్తూ ఓ అపార్టుమెంట్ చుట్టూ తిరిగే సంఘటనల సమాహారమే ఈ చిత్ర కథ. ప్రేక్షకులను మెప్పించేలా ఫాంటసీ, హర్రర్, కామెడీ జోనర్‌లో చిత్రీకరిస్తున్నట్టు దర్శకుడు వెల్లడించారు. ప్రస్తుతం చిత్రీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, అన్ని పూర్తిచేసి వేసవికి విడుదల చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు.

'యానిమల్ ఆరాధ్య'గా శారీగర్ల్



భారత మోడలింగ్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న మోడల్ ఆరాధ్య. రాంగోపాల్ వర్మ తెరకెక్కించిన 'శారీ' చిత్రంలో గ్లామర్ పాత్రలో కనిపించారు. సోషల్ మీడియాలోనూ హాట్‌హాట్ ఫొటోలు షేర్ చేస్తూ లక్షలాది మంది ఫాలోయర్లను సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఫొటోగ్రాఫర్ నవీన్ కళ్యాణ్ తాజాగా 'శారీగర్ల్' ఆరాధ్యతో కలిసి 'యానిమల్ ఆరాధ్య' పేరుతో ఒక ఫొటో షూట్ తీశారు. వీటిని దర్శకుడు రాంగోపాల్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నవీన్ కళ్యాణ్ రూపొందించిన 'యానిమల్' ఆరాధ్య ఫొటో సిరీస్ ఆవిష్కరించేందుకు ప్రత్యేక అతిథిగా రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇలాంటి ఫొటో షూట్‌ను నేను కూడా ఇంతవరకు చేయలేదు. ఈ ఫ్యాషన్ ఫొటో సిరీస్‌లో ఆరాధ్య ప్రకృతితో మమేకమైపోయారు' అని కితాబిచ్చారు. కాగా ఈ ఫొటో షూట్ అరుదైన పసుపు కొండ చిలువలు, నల్ల హంసలు, రేసు గుర్రాలు, అరుదైన పక్షులు వంటి వాటితో తీశారు. ఇందుకోసం సరైన కాస్ట్యూమ్‌ను డిజైనర్ ప్రణతి అద్భుతంగా డిజైన్ చేశారు. దీంతో ఈ ఫొటో సిరీస్ ఎంతో ఆకర్షణగా ఉంది.

తమిళ చిత్రజ్యోతి

'డెలివరీ బాయ్'గా లియో శివకుమార్



'డెలివరీ బాయ్' పూజా దృశ్యం

లియో శివకుమార్ కథానాయకుడిగా 'డెలివరీ బాయ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. బ్రిగిడా హీరోయిన్. ఎమోషనల్ డ్రామా మూవీగా రూపొందనున్న ఈ చిత్రాన్ని అముదా లియోనీ సమర్పణలో అసని క్రియేషన్స్ పతాకంపై నిర్మించనున్నారు. సినిమా షూటింగ్ పూజా కార్యక్రమంతో నగరంలో ప్రారంభమైంది. దర్శకుడు సుశీంద్రన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన నాని అనే యువకుడు తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఇందులో రాధిక, బోస్ వెంకట్, కాళీ వెంకట్, దుష్యంత్ జయప్రకాష్ తదితరులు ముఖ్య తారాగణం పోషిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను పాల్గొని తొలిషాట్‌కు క్లాప్ కొట్టారు.

వాస్తవ ఘటనల ఆధారంగా విక్రమ్ ప్రభు కొత్త చిత్రం



లలిత్ కుమార్, సురేష్, విక్రమ్ ప్రభు, అక్షయ్

నిజ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా విక్రమ్ ప్రభు హీరోగా కొత్త చిత్రం తెరకెక్కనుంది. ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన సురేష్ ఈ మూవీ ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గతంలో 'మాస్టర్', 'లియో', 'మహాన్' వంటి పలు హిట్ చిత్రాలను నిర్మించిన సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారా నిర్మాత లలిత్ కుమార్ కుమారుడు ఎల్‌కే అక్షయ్ కుమార్ కూడా తొలిసారి వెండితెరకు పరిచయమవుతున్నారు. టాలెంట్‌తో పాటు హార్డ్‌వర్క్ కలిగిన యువ కళాకారులకు కోలీవుడ్ ఎల్లవేళలా రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతుంది. అలా అక్షయ్ కుమార్‌ను ఈ ప్రాజెక్టులోకి దర్శకుడు సురేష్ తీసుకున్నారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ మూవీకి 'టానాక్కారన్' ఫేం తమిళ్ కథ అందిస్తున్నారు. . ఇప్పటికే తొలి షెడ్యూల్ షూటింగ్ ప్రారంభంకాగా, ఇందులో నటిస్తున్న నటీనటులు, టెక్నీషియన్ల వివరాలు వెల్లడించాల్సివుంది.



వడపళని మురుగన్ ఆలయం వద్ద భక్తుల సందడి





కోవై మరుదమలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం



రాష్ట్రంలో అంగరంగ వైభవంగా

తైపూస వేడుకలు

రాష్ట్రంలోని సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన క్షేత్రాల్లో మంగళవారం తైపూసం సందర్భంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఈ క్షేత్రాలు కిటకిటలాడాయి. భక్తుల 'హరోంహర' నామస్మరణతో మురుగన్ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. మాలధారణతో ఉపవాసం చేపట్టిన భక్తులు రకరకాల కావళ్లు మోసుకుంటూ పాదయాత్రగా మురుగన్ ఆలయాలకు చేరుకొని స్వామి దర్శనం తర్వాత దీక్ష విరమించుకున్నారు. అదే విధంగా పళని, తిరుప్పరంగుండ్రం తదితర ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగిన రథోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి



తిరుప్పరంగుండ్రంలో భక్తజన సందోహం







పళని క్షేత్రంలో నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు - తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ - పళని దండాయుధపాణి ఆలయ తైపూస ఉత్సవాలు

రజనీతో మాజీ మంత్రి వేలుమణి భేటీ



రజనీకాంత్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి, తొండాముత్తూరు ఎమ్మెల్యే ఎస్పీ వేలుమణి కలుసుకున్నారు. వేలుమణి కుమారుడు విజయ్‌వికాష్ వివాహం మార్చి 3న జరుగనుంది. కోయంబత్తూరు ఈచనారి సెల్వం మహల్‌లో జరుగనున్న ఈ వేడుకలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఇతర నాయకులు, వివిధ పార్టీల నాయకులు కూడా హాజరుకానున్నారు. గత కొద్ది రోజులుగా వేలుమణి పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులను కలిసి కుమారుడి వివాహ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. ఆ క్రమంలోనే చెన్నై పోయెస్‌గార్డెన్‌లో రజనీకాంత్‌ను కలిసి కుమారుడి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. వేలుమణితోపాటు ఆయన సోదరుడు అన్బరసన్, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

తిరువారూరులో పంగుని ఉత్తిర వేడుకలు ప్రారంభం



స్తంభానికి దీపారాధన చేస్తున్న ప్రధానార్చకులు

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు త్యాగరాజస్వామివారి ఆలయంలో పంగుణి ఉత్తిర వేడుకల శుభముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. వచ్చే ఏప్రిల్ 7న ఆశ్లేషా నక్షత్ర దినాన పంగుణి ఉత్తర వేడుకలు జరుగనున్నాయి. ఆ సందర్భంగా ఆసియా ఖండంలోనే అతి పెద్ద రథంగా పేరుగడించిన 'ఆళి తేరు' రథోత్సవం జరుగనుంది. ముందుగా ఆలయ రుణ విమోచకస్వామి సన్నిధి వద్ద శిలాస్తంభానికి పలుసుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి దీపారాధన చేశారు. తేరు వీధిలోని ఆళి తేరు వద్ద పూలమాలలతో అలంకరణ చేసి దీపారాధన నిర్వహించారు.

నేడు తిరువొత్తియూర్ ఆలయ తెప్పోత్సవం



పెరంబూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ త్యాగరాజస్వామి-వడివుడైఅమ్మవారి ఆలయంలో తైపూసం సందర్భంగా, ఆదిశేష తీర్థకొలనులో బుధవారం రాత్రి తెప్పోత్సవం జరుగనుంది. ఈ విషయమై ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... ఈ ఏడాది తెప్పోత్సవం ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఈ సారి భక్తులు మెట్లపై కూర్చొని స్వామి దర్శనం చేసుకొనేందుకు అనుమతించామన్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు, వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలకు జరుగకుండా 400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

వేదారణ్యేశ్వరస్వామికి కానుకగా ధాన్యం

- తరతరాలుగా కొనసాగుతున్న ఆచారం



వరి కట్టలకు దీపారాధన చేస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా తిరుత్తురైపూండి సమీపంలోని కున్నలూరు గ్రామంలో తైపూసం పర్వదినం సందర్భంగా కులదైవం వేదారణ్యేశ్వరస్వామికి 200 ఎకరాల్లో సాగు చేసిన ధాన్యం కానుకగా సమర్పించి మంగళవారం పూజలు నిర్వహించారు. కున్నలూరు గ్రామం, పరిసర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతాల రైతులు తైపూసం సందర్భంగా వరి కోతలు నిర్వహించి కట్టలు కట్టి నెత్తిపై పెట్టుకొని ప్రతి ఏటా ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని కానుకగా సమర్పించడం కొన్ని తరాలుగా కొనసాగుతోంది. ఈ ఏడాది తైపూసం రోజైన మంగళవారం వరి ధాన్యం కట్టలను ముందుగా కలంజియం విఘ్నేశ్వర ఆలయంలో ఉంచి శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మేళతాళాలతో ప్రధాన వీధుల మీదుగా సాగిన ఊరేగింపు వేదారణ్యేశ్వర సన్నిధికి చేరుకుంది. అక్కడ ధాన్యం కట్టలకు దీపారాధన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇదిలా ఉండగా, ఆలయ యాజమాన్యం ఆధ్వర్యంలో స్వామివారికి నివేదించిన వరి బియ్యంతో తయారుచేసిన పొంగలిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

కిటకిటలాడిన తిరుత్తణి ఆలయం

తిరుత్తణి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి ఆలయంలో తైపూసం ఉత్సవాల సందర్భంగా మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, అలంకరణ, దీపారాధన నిర్వహించారు. కొందరు భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకొని పాలు, పుష్ప, నెమలి కావళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామిని దర్శనం చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ తిరుత్తణికి ప్రత్యేక బస్సులు నడుపగా, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.





ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు - వేడుకలకు హాజరైన భక్తులు

మురుగన్ ఆలయాలకు పోటెత్తిన భక్తులు



మేల్‌మరువత్తూర్‌లో తైపూస జ్యోతి వెలిగిస్తున్న లక్ష్మి బంగారు అడిగళార్

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని చోళ రాజులు పాలించిన సమయంలో వాడుకలో ఉన్న తైపూస ఉత్సవాలను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తైపూసం సందర్భంగా కడలూరు జిల్లా వడలూరు అరుళ్ ప్రకాశ వల్లలార్ నెలకొల్పిన శక్తి జ్ఞాన సభలో నిర్వహించిన జ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సభలో ఈ ఏడాది 154వ తైపూస జ్యోతి దర్శన ఉత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం శక్తి జ్ఞాన సభలో అద్దాల ముందున్న ఏడు తెరలను తొలగించి భక్తులను జ్యోతి దర్శనానికి అనుమతించారు. చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో పీఠాధిపతి లక్ష్మి బంగారు అడిగళార్ జ్యోతి వెలిగించి తైపూసం వేడుకలను సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భగుడిలో అమ్మవారికి విశేష అభిషేకాలు, భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు అందించారు. సేలం జిల్లా ఆతూర్ సమీపంలో ఉన్న ఎత్తాపూర్‌లో ముత్తుమలై కొండపై ప్రపంచంలోనే అతి పొడవైన 146 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం ముందు వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తైపూసం ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు సుబ్రమణ్యస్వామి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపగా, పోలీసు శాఖ రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రత కట్టుదిట్టం చేసింది.

ఘనంగా తిరుమల నాయకర్ జయంతి



తిరుమల నాయకర్ చిత్రపటానికి తెలుగు వారితో కలసి నివాళులర్పిస్తున్న ఆచార్య సీఎంకే రెడ్డి

ప్యారీస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశాన్ని మదురై కేంద్రంగా నిర్ణయించి 17వ శతాబ్దంలో పరిపాలించిన నాయకర్ రాజవంశానికి చెందిన తిరుమల నాయకర్ 442వ జయంతి వేడుకలను అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కీల్పాక్కంలోని సమాఖ్య ప్రధాన కార్యాలయంలో తిరుమల నాయకర్ చిత్రపటానికి ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1623 నుంచి 1659 వరకు ఆంగ్లేయుల పాలనలో మదురై ప్రాంతాలను పరిపాలించిన తిరుమల నాయకర్ నిర్మించిన అనేక భవనాలు, ఆలయాలు నేటికీ చెక్కుచెదరక అద్భుతంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం, నాయకర్ మహల్ ఆ మహనీయుడు నిర్మించినవేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ ఉపాధ్యక్షులు డా.సీఎం కిషోర్, డా.గొల్లపల్లి ఇశ్రాయేలు, ప్రధాన కార్యదర్శి ఆర్.నందగోపాల్, కోశాధికారి కేవీ జనార్థనం, కుంకు దశరధరావు, లయన్ జి.మురళి, నేలటూరి విజయకుమార్, మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేశన్, జి.భాస్కర్, నిర్మల్ చందర్, జీవీ రామకృష్ణ సహా పలువురు తెలుగు ప్రముఖులు పాల్గొని తిరుమల నాయకర్‌కు నివాళులర్పించారు.

టీటీడీకి విరాళంగా ద్విచక్రవాహనాలు



తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు ఈ విద్యుత్ ద్విచక్రవాహనాలను అందజేశారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.70 లక్షలు, ఎన్‌డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని ప్రతినిధులు తెలిపారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించాక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి సంస్థల ప్రతినిధులు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, ఎన్‌డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో తమిళహీరో కార్తీ



తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో కార్తీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తీకి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం కార్తీ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో ఖైదీ-3, సర్దార్2 చిత్రాలు అభిమానుల ముందు రాబోతున్నట్టు తెలిపారు. తన కుమారుడు పుట్టిన తర్వాత తొలిసారిగా తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. హీరో కార్తీని ఆలయం ముందు చూసేందుకు పలువురు అభిమానులు పోటీ పడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారినీ కార్తిక్ దర్శించుకున్నారు. కాగా, తిరుమల శ్రీవారిని నటి భువనేశ్వరి దర్శించుకున్నారు.



→ ఆలయం ముందు హీరో కార్తీ - భువనేశ్వరి ←

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,169

తలనీలాలు సమర్పించినవారు: 24,559





అపాచీ, శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో ఉంది కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం. చోళరాజుల కాలం నాటి గుడి ఇది. ఆ పురాతన వాతావరణం ఆలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. చినమాంబట్టు గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి ఆలయంగా నిత్యపూజలందుకుంటోంది. పురాతన శిల్పాలతో నిండిన ఈ ఆలయం చిన మాంబట్టు గ్రామంలో ఉంది.

- తడ, ఆంధ్రజ్యోతి

చోళకళావైభవం

మాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయం

చరిత్ర: క్రీ.శ 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం ఇది. ఇందుకు ఆధారమైన శాసనాలు ఉన్నాయి. తొలుత గర్భగుడి, అర్ధమండపం నిర్మించారు. 13వ శతాబ్దంలో ఈ స్తంభమండపం నిర్మాణం జరిగింది. పల్లవ, చోళ శాసనాల్లో ఉన్న 'బట్టారక', 'పరమబట్టారక' అనే పదాలను పరిశీలిస్తే 'బట్టు' అనే పదమే కాలక్రమంలో మాంబట్టు అనే ఊరి పేరుగా మారి ఉండవచ్చని భావిస్తారు.

పురాణ ప్రాశస్త్యం: ఈ గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణుడి కోరిక మేరకు చోళుల కాలంలో శివాలయాన్ని నిర్మించారు. ఆలయానికి అవసరమైన భూమిని అదే గ్రామానికి చెందిన గుంటూరు మహదేవమ్మ అందించగా, యనమండ్రం నారసింహయ్యశర్మ, వెంకటరామయ్యశర్మలు అర్చకత్వానికి సిద్ధమయ్యారు. ఆలయం అయితే పూర్తవుతుంది కానీ ప్రతిష్ఠించడానికి దేవుడు కావాలి కదా. ఈ సమయంలో కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న ఒక యాత్రీకుడు పాలరాతి శివలింగాన్ని ఇచ్చాడు. శివుడితోపాటూ అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. కాలక్రమంలో చండీకేశ్వరి, దుర్గాదేవి, కాలభైరవుడు, నందీశ్వరుడు, మహావిష్ణువు, శ్రీవల్లి, దేవసమేత సుబ్రమణేశ్వరస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ఏర్పాటైంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా కాశీవిశ్వేశ్వరుడికి ప్రతీతి.



మాన్యం మాయం: వెంకటగిరి రాజుల పోషణ: మాంబట్టు కాశీవిశ్వేశ్వరుడి ఆలయం వద్ద తొలుత 26 బ్రాహ్మణ కుటుంబాలు అర్చకత్వంలో ఉండేవని చెబుతారు. వీరంతా ఆ తర్వాత వలస పోవడంతో ఆలయ పూజా కైంకర్యాలకు కొదవ ఏర్పడింది. పరిస్థితి వెంకటగిరి రాజుల దృష్టికి వెళ్లింది. వారు స్వామివారికి 79.43 ఎకరాలు, అమ్మణ్ణికి పసుపు, కుంకాల రూపేణ 25 ఎకరాల మాన్యం ఇచ్చారు. దాంతోనే ఆలయ ధూపదీప, నైవేద్యాలు నడిచేవి. 2006లో ఆ భూములను పరిశ్రమలకు అప్పగించడంతో ఇప్పుడు ఆ మాన్యమూ లేకుండా పోయింది.

తగ్గని వైభవం: శిథిల స్థితికి చేరుకున్న ఆలయాన్ని గ్రామస్థులే పట్టించుకుని పూర్ణోద్ధరణకు పూనుకున్నారు. ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు జరుగుతాయి. కార్తీకమాస ఉత్సవాలు మాత్రం తెలుగు, తమిళ సాంప్రదాయాల ప్రకారం రెండు నెలలపాటు నిర్వహిస్తున్నారు రోజూ రెండు పూటలా ధూపదీప, నైవేద్యాల సమర్పణ జరుగుతుంది. గ్రామ రైతు మన్నె శంకరయ్య విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులంతా కలిసి అన్నదాన సత్రం నిర్మించుకున్నారు. ప్రతి పౌర్ణమికీ ఇక్కడ అన్నదానం జరుగుతుంది.





శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పాలరాతి శివలింగం - అన్నపూర్ణాదేవి

ఆలయం శ్లాబు రాతిబండలపై చెక్కి ఉన్న మత్స్యం, ఉడుము, భక్తుల శిల్పాలు ఆకారాలు



శివరాత్రి ఉత్సవాలు: అంగరంగవైభవంగా నిర్వహించేవారు. శివరాత్రిని చిన్నమాంబట్టులోని ఆలయంలో కళ్యాణోత్సవాన్ని పెద్దమాంబట్టు ఆలయంలో, పారువేట ఉత్సవాన్ని ఎస్ఎంకండ్రి గ్రామంలో నిర్వహిస్తూ ఉండేవారు. ఆ ఆనవాయితీ నేటి కొనసాగుతూ ఉంది.



చెన్నై బెంగళూరు కారిడార్‌కు పచ్చజెండా

- రూ.78.84 కోట్ల నష్టపరిహారం విడుదల



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేయడానికి రూ.78.84 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడర్ ప్రాజెక్టు అభివృద్ధికి కోట మండలం కొత్తపట్టణం, చిల్లకూరు మండలం తమ్మినపట్టణంలో ప్రభుత్వ భూమిలో సాగులోని రైతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించలన్నారు. సాగులోని భూములను సర్వేచేసి, క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేసుకున్న తరువాత నష్టపరిహారం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్‌రెడ్డి, శివకుమార్,కోట, చిల్లకూరు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

17, 18న శాయ్ హాస్టల్ సెలక్షన్స్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్(యానం)సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ ప్లేయర్స్ ఆ రోజుల్లో ఉదయం 9గంటలకు యానం శాయ్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాల్సి వుంది. బ్యాడ్మింటన్‌కు 12నుంచి 18 సంవత్సరాల వయస్సు బాలురు, స్విమ్మింగ్‌కు 12నుంచి 16 సంవత్సరాల వయస్సు బాల, బాలికలు అర్హులు. జనన ధృవీకరణపత్రం, ఆధార్, ఇప్పటి వరకు పొందిన క్రీడా ప్రశంసాపత్రాలు, గవర్నమెంట్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సొంత స్పోర్ట్స్ కిట్ తీసుకురావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 98662 39009 (బ్యాడ్మింటన్), 88851 76888 (స్విమ్మింగ్) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులాగే రైతుకు 11 అంకెలతో యూనికోడ్‌ని కేటాయించడానికి కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతోందన్నారు. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు.. ఆ తర్వాత మిగిలిన భూ యజమానులకు రిజిస్ట్రీ నెంబర్లు జారీ చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ తమపేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చన్నారు. వెళ్లలేని పరిస్థితిలో ఫోన్ ద్వారా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి వివరాలు తెలిపి ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు.

అసంఘటిత కార్మికుడు 'ఈశ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, సంక్షేమ పథకాలు పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 16-59 సంవత్సరాల వరకు కార్మికులు అర్హులన్నారు. కార్మికుడి ఆధార్‌కార్డు, ఆధార్ లింకుతో ఫోన్, బ్యాంకుఖాతా వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చన్నారు.

ముక్కంటి సేవలో గాయకులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రముఖ గాయకులు రమ్య బెహరా, అనురాగ్ కులకర్ణి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వారం రోజుల్లో 41.5 కిలోల గంజాయి సీజ్

- బహిరంగం మద్యపాన ప్రియులపై 913 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. వారాంతపు నివేదికను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసి మాట్లాడారు. రాత్రి, పగలు గస్తీ పెంచామన్నారు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఈ వారం రోజుల వ్యవధిలో రాత్రి పూట రోడ్లపైన తిరుగుతున్న 165 మంది అనుమానితులను ఆయా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించి దాదాపు 41.5 కిలోలు సీజ్ చేసినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 913 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు వివరించారు. బహిరంగంగా మద్యం తాగే 81 ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. 119 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. విద్యాసంస్థలు, యూనివర్శిటీలకు సమీపంలోని బడ్డీ కొట్టులు, దుకాణాలు, కిరాణా షాపుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేసి గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. పుత్తూరు, తిరుపతి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, నాయుడుపేట, నాగలాపురం, చంద్రగిరి ప్రాంతాల్లో.. విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మేన్ దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



ఏఆర్ అభిషేక్ (ఫైల్‌ఫొటో)

తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో విధుల్లో ఉన్న ఓ గ్యాంగ్‌మేన్ దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం అనపగుంట రైల్వేగేటు సమీపంలో ఐదుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్‌మెన్ మంగళవారం పట్టాలపై గేజ్ లెవల్ తనిఖీ చేపట్టారు. ఈ బృందంలోని మేస్త్రీ దగ్గరలోని గేటు వద్దకు వెళ్లి గేట్‌మ్యాన్‌తో మాట్లాడుతుండగా, మరో ఇద్దరు తాగునీటి కోసం పక్కకు వెళ్లారు. మిగిలిన ఏఆర్ అభిషేక్(30), ముంజయ్ కుమార్ పని చేస్తుండగా నాగర్ కర్నూల్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేగంగా దూసుకొచ్చింది. దీంతో బిత్తరపోయిన ముంజయ్ కుమార్ పట్టాలపై నుంచి ఎగిరి పక్కకు దూకగా, అభిషేక్ పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ముంజయ్ కుమార్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన ముంజయ్ కుమార్‌ను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన అభిషేక్ స్వస్థలం కేరళ రాష్ట్రం కాగా, గాయపడిన ముంజయ్ కుమార్ బిహార్‌వాసి. పట్టాలపై గ్యాంగ్‌మెన్ విధులు నిర్వహిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకల సమయాన్ని తెలుసుకొంటూ సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన మేస్త్రీ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికార వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది.

సర్వలెన్స్ ప్రాజెక్ట్ ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ సర్వలెన్స్ ప్రాజెక్టు, న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గత నెల ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోగలరని ఆయన తెలిపారు.

పుస్తకమే పతాకం..!

- పుస్తక ప్రదర్శనపై దాడిని ఖండిస్తూ తిరుపతిలో నిరసన ర్యాలీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించిన 17వ పుస్తక ప్రదర్శనపై జరిగిన దాడి పట్ల పుస్తకాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాలాజీ కాలనీలోని జ్యోతిబాపూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రామాయణం, భారతం, భాగవతం, మహాప్రస్థానం సహా ఎవరికి నచ్చిన పుస్తకాలను వారు జెండాలా చేతపట్టుకుని ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. టౌన్‌క్లబ్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కూడలి, గాంధీ రోడ్డు మీదుగా నాలుగుకాళ్ళ మండపం దాకా ర్యాలీ సాగింది. 'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ', 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు, పుస్తకాలను చింపినంత మాత్రాన, పుస్తకాల్లోని భావాలను చంపలేరు' అంటూ నినదించారు. ర్యాలీలో భాగంగా తిరుపతి గాంధీరోడ్డులో గల విశాలాంధ్ర బుక్ హౌస్ ఎదురుగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. నాలుగు కాళ్ల మండపం వద్ద నిలబడి నిరసన తెలిపారు. పుస్తకప్రియులను ఉద్దేశించి పలువురు రచయితలు, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. ఏ పుస్తకాలు చదవాలో, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు. పుస్తక ప్రదర్శనలోని ఒక స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కొని, చించి పోగులు పెట్టి, దహనం చేయడానికి ప్రయత్నించిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ స్టాల్‌పైనా దాడి చేసి స్వాతంత్ర్య సమరయోధుడు పెరియార్ పుస్తకాలు అమ్మరాదని ఆదేశించి, తీసేయించడం దారుణమన్నారు.

ఈ సందర్భంగా తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకాలపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఇంగ్లీషు రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డాక్టర్ కడియాల వెంకటరమణ (అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు), సీనియర్ జర్నలిస్టు ఆలూరి రాఘవ, రచయితలు ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు, మూరిశెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, గొడుగుచింత గోవిందయ్య, నాగులూరు దయాకర్ పాల్గొన్నారు. ఇంకా నిర్మల, రెడ్డెప్ప (జన విజ్ఞాన వేదిక), వెంకటరమణ (సాహితీ స్రవంతి), మల్లారపు నాగార్జున (వేమన విజ్ఞాన కేంద్రం), నడ్డి నారాయణ (బాలోత్సవం), పరమేశ్వరరావు (పౌర చైతన్య వేదిక), సాకం నాగరాజ (జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు), యువశ్రీ మురళి (అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు), నెమిలేటి కిట్టన్న (అరసం జిల్లా కార్యదర్శి), తమటం రామచంద్రారెడ్డి (తెలుగు భాషోద్యమ సమితి),కందారపు మురళి (సీఐటీయూ), డాక్టర్ పి.సాయిలక్ష్మి (ఐద్వా జిల్లా కార్యదర్శి), లక్ష్మి (ఎస్‌యూసీఐ), వందవాసి నాగరాజు (సీపీఎం జిల్లా కార్యదర్శి), రామా నాయుడు (సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు), అంజయ్య (దళిత సాహిత్య వికాస వేదిక), వెంకటరత్నం (సీనియర్ కమ్యూనిస్టు నేత), ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, బీసీ సంఘర్షణ సమితి నేత లక్ష్మయ్య, యమలా సుదర్శన్ (దళిత శంఖారావం పత్రిక ఎడిటర్), జర్నలిస్టు సంఘం నాయకుడు ప్రసాద్, మస్తానమ్మ (శంకరంబాడి సాహిత్య పీఠం) తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ లక్ష్మీవిలాసపురం గ్రామానికి చెందిన వై.చిట్టిబాబు(50)కు ఒకటిన్నర ఎకరా ఉంది. వరి, వేరుశనగ, చిక్కుడు తోట సాగుచేశారు. వచ్చిన కాస్త దిగుబడి గత తుఫాను వల్ల నష్టపోయారు. సాగుకు బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. అప్పు తీర్చే మార్గం కనిపించక సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు తాగి పడిపోయారు. స్థానికులు గుర్తించి 108లో నగరి ఏరియా ఆస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య నఖిల, పిల్లలు కార్తీక్, ఆశ ఉన్నారు.



చిట్టిబాబు (ఫైల్ ఫొటో)

భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చి భార్య ఆత్మహత్య



మృతి చెందిన సుజాత

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన భార్య మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రేణిగుంట మండలం కొత్రమంగళంలో చోటుచేసుకుంది. చెంగారెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన కె.సుజాత(37), ఈశ్వరయ్య దంపతులు. నిత్యం మద్యంతాగొచ్చి అనుమానంతో భార్యను వేధించేవాడు. గతేడాది అక్టోబరు 23న దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ గొడవలో భర్త తలపై బలంగా కొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న సుజాత పది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైంది. ఇంటికి రాగా, పిల్లలు ఆమెను దూరం పెట్టారు. గ్రామంలోనూ ఎవరూ పలకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. కొత్రమంగళం హరిజనవాడలోని అంగన్వాడీ టీచర్ అయిన తన కోడలి ఇంటికి చేరింది. సోమవారం రాత్రి పాత పంచాయతీ భవనంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్ రేడియోలాజికల్ ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులకు వాక్ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిప్రదికన రేడియోలాజికల్ ఫిజిక్స్(మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19న వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. రిజర్వేషన్ కింద ఎస్టీ 1, బీసీ-బి 1, ఈడబ్ల్యూఎస్ 1, ఓసీ 1 కింద ఈ నాలుగు పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. 42 ఏళ్ల లోపు వారు అర్హులని.. ఎంపికైన వారికి నెలకు రూ.61 వేల వేతనం ఉంటుందని ఆమె వివరించారు. వీటికి హిందూ మతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19న పాత డైరెక్టరు కార్యాలయంలో నిర్వహించే వాక్ఇన్ ఇంటర్వ్యూకు అన్నీ ధృవీకరణ పత్రాలతో హాజరుకాగలరని ఆమె వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు

- కింది కోర్టు తీర్పునే ఖరారు చేసిన ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించి ఫారెస్టు అధికారి, కోర్టు సహాయ లైజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తిరుపత్తూరుకు చెందిన స్వామినాధన్ అన్నామలై 2014లో శేషాచలం నుంచి చంద్రగిరి మండలం నడింపల్లి బస్టాపు వద్దకు స్మగ్లర్లు తీసుకొచ్చిన 292 కిలోల బరువు కల తొమ్మిది ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలించడానికి వాహనంలో ఎక్కిస్తున్నాడు. అటవీశాఖ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 2018లో ఏడాది జైలు శిక్ష, రూ 10,000 జరిమానా విధించారు. దీనిపై నిందితుడు తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టుకు వెళ్లారు. కింది కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేయాలని ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి ఆదేశించారు. ఈ కేసులో స్పెషల్ పీపీ కోటేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. లైజన్ అధికారులుగా జె.చంద్రశేఖర రాజు, సహాయ లైజన్ అధికారులుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.